క్వింటా వడ్లకు 700 నష్టం

- కాంగ్రెస్ విధానాల వల్లే రైతులకు కష్టాలు
- ఆ మొత్తాన్ని ఖాతాల్లో జమచేయాలి
- కనీస మద్దతు ధరకు ధాన్యం కొనాలి
- హామీ ప్రకారం 500 బోనస్ చెల్లించాలి
- దళారుల గుప్పిట్లోకి మార్కెట్లు
- మంత్రులు ఉత్తమ్, తుమ్మల ఎక్కడ?
- మీడియాతో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా

హైదరాబాద్, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర దేవుడెరుగు కనీసం మద్దతు ధర కూడా లభించడం లేదని, దీంతో రైతులు ఒక్కొక్క క్వింటాకు రూ.700 వరకు నష్టపోతున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తూ కాంగ్రెస్ హామీ ఇచ్చిన విధంగా క్వింటాకు రూ.500 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులు ధాన్యం కేంద్రాలకు వెళ్లి మద్దతు ధర కోసం, బోనస్ కోసం ఒత్తిడి చేయాలని పిలుపునిచ్చారు. రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ అండగా నిలబడి పోరాడుతుందని చెప్పారు. శుక్రవారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న పదేండ్లలో కనీస మద్దతు ధర కల్పించిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం వల్లనే రైతులకు కష్టాలు, నష్టాలు ఎదురవుతున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యానికి మద్దతు ధర కల్పించేందుకు ప్రయత్నించకపోవడంతో రైతులు క్వింటాకు రూ.1,500 నుంచి రూ.1,700 చొప్పున అమ్ముకుంటున్నారని, దీంతో క్వింటాకు రూ.700 వరకు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇంత జరుగుతున్నా పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చోద్యం చూస్తున్నారా? వారు ఎక్కడ? అని ప్రశ్నించారు. జనగామ మార్కెట్‌లో మధ్యాహ్నం 12 నుంచి 1 గంట మధ్య లాట్ రేట్లను ప్రకటించాల్సి ఉండగా సాయంత్రం 5 గంటలకు ప్రకటించారని పేర్కొన్నారు. అధికారిక లెక్కల ప్రకారం జనగామ జిల్లాలోని 193 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 442 టన్నులు మాత్రమే కొనుగోలు చేయగా, మార్కెట్ యార్డ్‌లో 4,047 టన్నులు కొనుగోలు చేశారని వివరించారు. కొనుగోలు కేంద్రాల్లో కనీస సౌకర్యాలు లేవని మండిపడ్డారు. మార్కెట్‌లో రూ.1,530 మాత్రమే చెల్లిస్తున్నారని చెప్పారు. రైతులతో కలిసి నిలదీస్తే మొదట తక్కువ ధరకు కొనడం లేదని అధికారులు బుకాయించారని, వ్యవహారం సీఎం దాకా వెళ్లినా రైతులకు అదనంగా లభించింది రూ.30 మాత్రమేనని తెలిపారు. గతంలో వరంగల్ డిక్లరేషన్ పేరుతో, ఆ తరువాత వివిధ ఎన్నికల సభల్లో బోనస్‌పై రేవంత్‌రెడ్డి చేసిన ప్రసంగాల వీడియోలను ఈ సందర్భంగా ప్రదర్శించారు. కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయలేదని దుయ్యబట్టారు.

మద్దతు ధర ఇచ్చిన ఘనత కేసీఆర్‌దే

2014-15లో 24 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తే, 2021-22లో 141 లక్షల టన్నులు, గత యాసంగిలో 66 టన్నుల ధాన్యాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం కొనుగోలు చేసిందని పల్లా రాజేశ్వర్‌రెడ్డి గుర్తుచేశారు. కేసీఆర్ పాలనలో రైతులు ఎన్నడూ పంటలను తక్కువ ధరకు అమ్ముకోలేదని, ఐకేపీ కొనుగోలు కేంద్రాల వద్దనే కొనుగోలు చేశామని వివరించారు. కరోనా సమయంలోనూ ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు కొన్న ఘనత కేసీఆర్‌దేనని చెప్పారు. రైతులు మరింత నష్టపోక ముందే ప్రతి గింజను మద్దతు ధరకు కొనుగోలు చేసేలా, బోనస్ ఇచ్చేలా ప్రభుత్వం కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే గంట్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో రైతులకు కష్టాలు పెరిగిపోయాయని, రైతులు పంటలు ఎండిపోయి ఒకవైపు బాధపడుతున్నారని, మరోవైపు పండించిన పంటకు ప్రభుత్వం మద్దతు ధర కల్పించలేకపోతున్నదని విమర్శించారు. ఇప్పుడు వడ్లు పండించిన రైతులు నష్టపోతున్నారని, రేపు మక్కజొన్న పంట కూడా మార్కెట్‌కు రాబోతున్నదని ఎన్నికల కోడ్ పేరుతో సీఎం, మంత్రులు తప్పించుకోవాలనుకుంటే కుదరదని హెచ్చరించారు.

దళారుల చేతుల్లోకి మార్కెట్లు

రాష్ట్రవ్యాప్తంగా ధాన్యానికి కనీస మద్దతు ఇవ్వాలని, లేకుంటే బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని పల్లా రాజేశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. దళారుల చేతుల్లోకి మార్కెట్లు వెళ్లిపోయాయని, సీఎం, మంత్రులు రైతులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. బోనస్ మాట దేవుడెరుగు మద్దతు ధర కూడా రాని పరిస్థితుల్లో రైతులు ఉంటే రేవంత్, భట్టివిక్రమార్క ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రైతుబంధు, రుణమాఫీపై మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వంపై రైతులకు విశ్వాసం పోయిందని చెప్పారు. అందుకే కొనుగోలు కేంద్రాలకు కాకుండా దళారుల దగ్గరికి ధాన్యం తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. రైతులకు కనీస మద్దతు ధర దక్కేలా ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని, ఇప్పటికే వడ్లను తక్కువ ధరకు అమ్ముకున్న రైతులకు నష్టపోయిన మొత్తాన్ని వారి అకౌంట్లలో జమచేయాలని డిమాండ్ చేశారు. కేవలం రూ.30 పెంచి రూ.1,560కు వడ్లను కొన్నందుకు జనగామ అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ప్రశంసిస్తున్నారా? అని నిలదీశారు. సీఎం ఆదేశాల తర్వాత కూడా రైతులు క్వింటాకు రూ.700 నష్టపోతున్నారని తెలిపారు.

ధర తగ్గిస్తే ఊరుకోం

మిల్లర్లు, ట్రేడర్ల లైసెన్స్ రద్దుతోపాటు బ్లాక్‌లిస్ట్‌లో పెట్టండి

రైతులు ధాన్యాన్ని ఆరబెట్టిన తర్వాతే మార్కెట్‌కు తేవాలి: సీఎం

హైదరాబాద్, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ): రైతులు అమ్ముకునే ధాన్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రైతులను మోసం చేసే మిల్లర్ల పట్ల కఠినంగా వ్యవహరించాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లు, తాగునీటి సరఫరాపై శుక్రవారం ఆయన మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. మార్కెట్ యార్డుల్లో తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసే మిల్లర్లు, ట్రేడర్ల లైసెన్సులను రద్దు చేయాలని, కస్టమ్ మిల్లింగ్ నిలిపివేసి నిషేధిత జాబితాలో చేర్చాలని ఆదేశించారు. కొన్ని చోట్ల తేమ ఎక్కువగా ఉన్నదంటూ వ్యాపారులు, మిల్లర్లు ధరలో కోత పెడుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. రైతులు ధాన్యాన్ని కళ్లాల నుంచి నేరుగా కాకుండా ఒకటి రెండు రోజులు ఆరబెట్టి తీసుకొనిరావాలని కోరారు. ధాన్యం ఆరబెట్టేందుకు మార్కెట్ యార్డుల్లో తగిన ఏర్పాట్లుచేయాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వడ్ల దొంగతనం జరగకుండా చూడాలని ఆదేశించారు. వడగండ్ల వానలు వచ్చినా ఇబ్బంది లేకుండా టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని, కలెక్టర్లు తమ పరిధిలోని మార్కెట్లు, ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించాలని సూచించారు. కనీస మద్దతు ధర అమలయ్యేలా చూడాలని, రైతుల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను రాష్ట్రస్థాయిలో రోజూ పర్యవేక్షించాలని స్పష్టంచేశారు. తాగునీటి సరఫరా పర్యవేక్షణకు ఉమ్మడి జిల్లాలకు నియమితులైన సీనియర్ ఐఏఎస్ అధికారులు ధాన్యం కొనుగోళ్లను కూడా పర్యవేక్షించాలని సూచించారు. ఎన్నికల నేపథ్యంలో కొన్నిచోట్ల రాజకీయ లబ్ధి కోసం తప్పుడు ఫిర్యాదులు, ఉద్దేశపూర్వక కథనాలు వస్తున్నాయని, అటువంటి వాటిపై వెంటనే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయాలని ఆదేశించారు.

వచ్చే రెండు నెలలు కీలకం

పట్టణాలు, గ్రామాల్లో తాగునీటికి ఇబ్బంది తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. పెరుగుతున్న ఎండల దృష్ట్యా రాబోయే రెండు నెలలు మరింత కీలకమని చెప్పారు. గత ఏడాదితో పోలిస్తే ఎక్కువ నీటిని సరఫరా చేస్తున్నా ప్రజల అవసరాలకు సరిపోవడం లేదని పేర్కొన్నారు. భూగర్భజల మట్టం పడిపోవడంతో ప్రజలు నల్లా నీటిపైనే ఆధారపడుతున్నారని, అందుకే ఈ పరిస్థితి తలెత్తిందని వివరించారు. సీఎస్ సారథ్యంలో మిషన్‌భగీరథ, మున్సిపల్, ఇరిగేషన్, విద్యుత్తు శాఖ అధికారులు తాగునీటి సరఫరాపై రోజూ సమీక్ష జరపాలని ఆదేశించారు. ఉమ్మడి జిల్లాలకు నియమితులైన ప్రత్యేక అధికారులు తాగునీటి ఇబ్బందులున్న చోటికి స్వయంగా వెళ్లి పరిశీలించాలని, సమస్యను పరిష్కరించే చర్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. హైదరాబాద్‌లో తాగునీటి సరఫరాకు ఢోకా లేకుండా చూడాలని, మరింత డిమాండ్ పెరిగినా ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని అధికారులను అప్రమత్తం చేశారు. అవసరమైతే నాగార్జున సాగర్ డెడ్‌స్టోరేజీ నుంచి నీటిని తెచ్చుకోవాలని ఆదేశించారు. సింగూర్ నుంచి నీటి సరఫరాకు సన్నద్ధంగా ఉండాలని కోరారు. కృష్ణా బేసిన్‌లో నీటి లభ్యత లేనందున ఎగువన నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి తాగునీటిని తెచ్చుకునేలా కర్ణాటకతో సంప్రదింపులు జరపాలని సూచించారు. హైదరాబాద్‌లో ఇటీవల సిబ్బంది అత్యుత్సాహంతో ఒకచోట తాగునీటి సరఫరా నిలిచినట్టు సీఎం దృష్టికి వచ్చింది. ఉద్దేశపూర్వకంగా ఆటంకం కల్పించినవారిని ఉద్యోగాల నుంచి తొలగించాలని సీఎం ఆదేశించారు.

జనగామ మార్కెట్‌కు ట్రాక్టర్లతో తెచ్చిన ధాన్యంతో రైతులు

కేసుల సంగతి తేలేదాకా వడ్లు కొనం

- ఈ-నామ్ ప్రకారమే ధాన్యం కొంటున్నం
- రైతులకు ఇష్టమైతేనే సరుకు అమ్ముతరు
- మాపై కేసులు ఎత్తివేయాలి : వ్యాపారులు

జనగామ రూరల్, ఏప్రిల్ 12: ఇటీవల ప్రభుత్వం ముగ్గురు ట్రేడర్లపై కేసు నమోదు చేయడాన్ని నిరసిస్తూ వ్యాపారులు శుక్రవారం జనగామ మార్కెట్‌లో ధాన్యం కొనుగోళ్లు నిలిపేశారు. ఈ సందర్భంగా వ్యాపారులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తమను ఇబ్బందులకు గురిచేస్తున్నదని, మార్కెట్ నిబంధనల ప్రకారం ఉన్న ధరలకే తాము రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. రైతులు పచ్చిగా ఉన్న ధాన్యాన్ని మార్కెట్‌కు తీసుకురావడం, హమాలీల సమస్య ఉండటంతో మార్కెట్‌లో ధాన్యం కొనుగోళ్లను బంద్ చేసినట్టు చెప్పారు. ఫలితంగా రైతులు తీసుకొచ్చిన ధాన్యం రాశులతో మార్కెట్ నిండిపోయింది. ధాన్యం అమ్ముకునేందుకు రైతులు నాలుగైదు రోజులుగా మార్కెట్‌లోనే పడిగాపులు కాస్తున్నారు. వ్యాపారులపై ప్రభుత్వం క్రిమినల్ కేసులు నమోదు చేయడం వల్లే మార్కెట్‌లో ధాన్యం కొనుగోళ్లను బంద్ చేసినట్టు జనగామ ట్రేడర్స్ అధ్యక్షుడు నాగబండి రవీందర్ పేర్కొన్నారు. మార్కెట్‌లో ఈ-నామ్ ప్రకారమే ధర నిర్ణయిస్తారని, వాటి ప్రకారమే రైతు అమ్ముకుంటే తాము కొనుగోలు చేస్తామని ఆయన వివరించారు. వ్యాపారులు రేటు నిర్ణయించి తక్కువకు కొనుగోలు చేస్తున్నారనేది తప్పుడు ప్రచారమని, తమపై కేసులను ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు.

పాలమూరులో అకాల వర్షం

పిడుగుపడి మహిళ .. విద్యుదాఘాతంతో తోడికోడళ్లు మృతి

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 12 : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం అకాల వర్షం కురిసింది. పిడుగుపాటుకు ఒకరు, విద్యుదాఘాతానికి ఇద్దరు మరణించారు. నాగర్‌కర్నూల్, అచ్చంపేట, ఉప్పునుంతల, తిమ్మాజీపేట, రాజాపూర్ మండలాల్లో ఈదురుగాలులతో కూడిన వాన పడింది. పలుచోట్ల మామిడికాయలు నేలరాలాయి. కాగా ఉప్పునుంతల మండలం తాడూర్‌కు చెందిన గుండేమోని శ్యామలమ్మ (34) శుక్రవారం తన పొలం వద్ద ఉన్న సమయంలో ఈదురుగాలులు వీయడంతో చెట్టుకిందకు వెళ్లింది. ఒక్కసారిగా చెట్టుపై పిడుగు పడటంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. తాడూరు మండలం ఐతోలు గ్రామానికి చెందిన అన్నదమ్ములు యూసుఫ్, ఇబ్రహీం ఇంటి సమీపంలో ఇబ్రహీం ఐరన్ డబ్బాలో బోరుమోటర్ వైండింగ్ నిర్వహిస్తున్నారు. కాగా సాయంత్రం వర్షం కురిసిన తర్వాత డబ్బాలోకి వెళ్లిన ఇబ్రహీం భార్య ఆలియాబేగం (40) ఇనుప పైపులను పట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురై కేకలు వేసింది. అక్కడే ఉన్న తోడికోడలు తస్లీమా బేగం(50) కూడా డబ్బా వద్దకు వచ్చి పట్టుకోవడంతో ఆమె కూడా విద్యుత్తు షాక్‌కు గురై ఇద్దరూ మరణించారు. నల్లగొండ జిల్లాలో శుక్రవారం సాయంత్రం వర్షం కురిసింది. దాదాపుగా అరగంటపాటు ఆగకుండా కురిసింది. జిల్లాలోని పది మండలాల్లో ఓ మోస్తరుగా వర్షం కురువడంతో పెద్దగా నష్టం జరుగకపోయినా అక్కడక్కడ పాక్షికంగా ధాన్యం తడిసింది.

నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్జాలబావి ధాన్యం కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం

సుధీర్ మాదిగకే టికెట్

మొదటిపేజీ తరువాయి...

మేరకు అధినేత కేసీఆర్ సుధీర్‌కుమార్ అభ్యర్థిత్వాన్ని ప్రకటించారు. అంతకుముందు వరంగల్ లోక్‌సభ పరిధిలోని పార్టీ ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్యనేతలతో కేసీఆర్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు.

ఉద్యమ నేతకే టికెట్

తెలంగాణ ఉద్యమంలో చురుకైన వ్యక్తి.. మారెపల్లి సుధీర్ కుమార్ మాదిగ. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో 1962లో మారెపల్లి జాన్, కిరీటమ్మ దంపతులకు జన్మించిన ఈయన.. కాకతీయ యూనివర్సిటీ నుంచి బీఏఎంఎస్, యూనివర్సిటీ ఆఫ్ హెల్త్‌సైన్సెస్‌లో ఎండీ పూర్తి చేశారు. 2001లో టీఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యత్వం తీసుకొన్న సుధీర్ కుమార్.. ఉద్యమ సమయంలో మూడు సార్లు జైలుకు వెళ్లారు. ఆనాటి హుస్నాబాద్ ఎమ్మెల్యే అల్లి రెడ్డి ప్రవీణ్‌రెడ్డి ఇంటి ముట్టడి చేసినప్పుడు రెండు రోజులు జైలుకెళ్లారు. ముల్కనూర్‌లో ఆనాటి రాష్ట్ర మంత్రి శిల్పామోహన్‌రెడ్డి సందర్శనను అడ్డుకున్నందుకు మూడు రోజులు జైలు శిక్ష అనుభవించారు. దండేపల్లిలో రైల్‌రోకోలో పాల్గొన్నందుకు

మూడు రోజులు జైలుకు వెళ్లారు. ఇవేకాక అనేక సార్లు ఉద్యమంలో ఈయనను పోలీసులు అరెస్టు చేశారు. బైండోవర్లు చేశారు. 1995-2000 వరకు భీమదేవరపల్లి మండల పరిషత్తు అధ్యక్షుడిగా, 2001-2006 మధ్య ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిషత్తు ఉపాధ్యక్షుడిగా పనిచేయగా.. ప్రస్తుతం హనుమకొండ జిల్లా పరిషత్తు చైర్మన్‌గా కొనసాగుతున్నారు. సుధీర్ కుమార్ భార్య శోభారాణి మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. వీరికి కొడుకు, కూతురు ఉన్నారు.

ఉద్యమకారులు కోరిన అభ్యర్థి సుధీర్‌కుమార్

బీఆర్ఎస్‌కు మాజీ ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి తన కూతురి కోసం పట్టుబట్టి పార్టీకి విధేయులుగా పనిచేసిన ఎంతోమందిని పార్టీని నుంచి బయటికి పంపారని గులాబీ శ్రేణులు ఇప్పటికే భగ్గుమంటున్నాయి. అనేక కారణాలతో కడియం శ్రీహరి కూతురు కావ్యకు బీఆర్ఎస్ టికెట్ ప్రకటించినా, ఆ కృతజ్ఞత లేకుండా కాంగ్రెస్‌లో చేరినందుకు వారికి గుణపాఠం చెప్పాలంటే ఉద్యమంలో మొదటి నుంచి పనిచేసిన నాయకుడికి, మాదిగ సామాజికవర్గానికి చెందిన నేతకు టికెట్ ఇవ్వాలనే డిమాండ్ వచ్చింది. ఈ నేపథ్యంలో సుధీర్‌కుమారే సరైన అభ్యర్థి అని అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

లోకం పోకడ

చూడు.. సూర్యుడు బంగారంలా మండిపోవడం లేదూ?

ఎండా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
నల్లగొండ	39.5°c	24.2°c
రంగారెడ్డి	39.3°c	22.9°c
నిజామాబాద్	37.6°c	25.0°c
మెదక్	37.0°c	23.6°c
ఆదిలాబాద్	36.4°c	22.2°c
మహబూబ్‌నగర్	36.0°c	25.2°c
ఖమ్మం	36.0°c	24.0°c
హైదరాబాద్	34.6°c	24.9°c
కరీంనగర్	34.0°c	25.0°c
వరంగల్	33.0°c	25.0°c

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం

హైదరాబాద్, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ): ఉపరితల ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. కొన్నిరోజులపాటు వరుసగా భారీగా నమోదవుతూ వస్తున్న గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పతనమయ్యాయి. వడగాడ్పుల తీవ్రత సైతం తగ్గడంతో ప్రజలకు కాస్త ఉపశమనం కలిగింది. బుధ, గురువారాల్లో వాతావరణం చల్లబడింది. రాత్రి చల్లటి గాలులు వీశాయి. శుక్రవారం నాటికి గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదయ్యాయి.

వంద రోజుల్లోనే రుణమాఫీ చేస్తామన్లేదు

కాంగ్రెస్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

వరంగల్, ఏప్రిల్ 12(నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వెంటనే రుణమాఫీ చేస్తామని చెప్పలేదని, ఏడాది లోపు చేస్తామని చెప్పామని పరకాల కాంగ్రెస్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, ఎంపీ అభ్యర్థి కడియం కావ్యతో కలిసి శుక్రవారం హనుమకొండలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయాన్ని స్పష్టం చేశారు. డిసెంబర్‌లోనే రుణమాఫీ చేస్తామని పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్ చెప్పారు కదా అని విలేకరులు గుర్తుచేస్తే, అదేమీ లేదని దాటవేశారు. డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తామని తాము చెప్పలేదని, అందుకు ఏడాది సమయం కావాలని తెలిపారు. ఈ విషయంలో తాము ఏం చెప్పామో కావాలంటే ఒకసారి చూసుకోవాలని చెప్పారు. 100 రోజుల్లో రుణమాఫీ చేస్తామని తాము ఎక్కడా చెప్పలేదని వివరించారు. కడియం కావ్యపై పార్టీలో వ్యతిరేక ఉన్నదన్న విషయాన్ని అంగీకరించారు. ప్రతి పార్టీకి ప్రారంభంలో కొంత వ్యతిరేకత ఉంటుందని పేర్కొన్నారు. అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి పనిచేయాల్సి ఉంటుందని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో రెండుమూడు రోజుల్లో పెద్ద తలకాయల పేర్లు బయటకు వస్తాయని పేర్కొన్నారు. రుణమాఫీకి ఏడాది పడుతుందంటూ రేవూరి చేసిన వ్యాఖ్యల వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది.

పంటలన్నీ మునిగి.. అప్పులన్నీ మిగిలి..!

తరతరాలుగా వ్యవసాయమే జీవనాధారం • అతివృష్టి, అనావృష్టితో పంటనష్టం

- పిల్లల గోస తీర్చాలని రెక్కల కష్టం
- ఉన్న భూమికి తోడు కౌలు సాగు
- ఆశలు అడియాసలై ఆశన్న ఆత్మహత్య

ఆదిలాబాద్, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ) : 'మేమిద్దరం.. మాకిద్దరు'అనేలా రైతు కాకేర్ల ఆశన్న(45)ది మధ్య తరగతి కుటుంబం. ఆశన్నకు ఆరు ఎకరాల భూమి ఉంది. ఇద్దరు పిల్లలతో హాయిగా సంసారం సాగుతోంది. 'పిల్లలిద్దరూ పెద్దగవుతున్నారు. వారు మనలెక్క ఎవుసం చేయొద్దు.. మంచి ఉద్యోగాలు చేయాలి'.. అంటూ భార్య సుచరితకు ఆశన్న తరుచూ చెప్తుండేవాడు. పిల్లల చదువుల ఫీజులు.. రోజు రోజుకు పెరుగుతున్న ధరల మధ్య ఆశన్న మధ్యతరగతి బండి ముందుకు సాగడం కష్టం అవుతున్నది. దీంతో రెక్కల కష్టం పెరిగినా సరే.. అని ఆశన్న మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు ప్రారంభించాడు. ఇక్కడే ఆశన్న లెక్క తప్పింది. అతివృష్టికి ఒకసారి, అనావృష్టికి మరోసారి పంటలు దెబ్బతిన్నాయి. అప్పులు కుప్పగా మారడంతో పంట చేన్లలోనే ఆశన్న పురుగుల మందు తాగి కుప్పకూలాడు. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని బరంపూర్‌కు చెందిన రైతు కాకేర్ల ఆశన్న(45)కు ఆరు ఎకరాల భూమి ఉన్నది. భార్య సుచరిత, కూతురు త్రిశ, కొడుకు వంశీతో కలిసి హాయిగా సాగుతున్న మధ్యతరగతి కుటుంబం వారిది. ఆశన్న తాతలు, తండ్రుల కాలం నుంచి కూడా వ్యవసాయాన్నే నమ్ముకుని ఉపాధి పొందుతున్నారు. ఆశన్న నమ్మకాన్ని పిల్లలిద్దరూ వమ్ము చేయలేదు. కూతురు త్రిశ ఆదిలాబాద్‌లో ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతున్నది. కుమారుడు వంశీ ఇంటర్ చదువుతున్నాడు. ఇద్దరు పిల్లలు బాగా చదువుకుంటున్న సమయంలో పెరిగిన ఖర్చులతో ఆశన్న ఆలోచన మారింది. ఉన్న ఆరు ఎకరాలకు తోడు మరో నాలుగు ఎకరాల భూమిని కౌలుకు తీసుకున్నాడు. దంపతులిద్దరూ వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యేవారు. రెక్కల కష్టాన్ని నమ్ముకుని పంటలను తమ చంటి పిల్లల్లాగా సాదుకున్నారు. గతేడాది వానకాలంలో పదికరాల్లో పత్తి, కంది పంటలు వేశారు. పంట పెట్టుబడి కోసం రూ.3 లక్షల వరకు అప్పులు తీసుకువచ్చారు. పంటలు మంచిగా ఎదుగుతున్న దశలో గత జూలైలో కురిసిన భారీ వర్షాలకు వీరి ఆశలన్నీ కొట్టుకుపోయాయి. పంటలను కాపాడుకునేందుకు ఆశన్న చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు. పంట చేన్లలో భారీగా నీరు నిలిచి నాలుగెకరాల్లో పత్తి, కంది పంటలు ఏ మాత్రం పనికిరాకుండా పోయాయి. ఆతరువాత యాసంగిలోనూ వేసిన పంటలకు సాగునీళ్లు కరువై దిగుబడి రాలేదు.

దిగుబడి తగ్గి.. అప్పులు పెరిగి..

ఆశన్న పదికరాల్లో పంటలు సాగు చేస్తే పెట్టుబడి కూడా రాలేదు. ఈ ఏడాది 10 ఎకరాల్లో 35 క్వింటాళ్ల పత్తి దిగుబడి మాత్రమే వచ్చింది. దీంతో పంటల సాగు కోసం ఆశన్న కోసం రూ.7 లక్షల వరకు అప్పు చేశాడు. ఆదిలాబాద్ ఎస్బీఐలో పంట రుణం రూ.3 లక్షలు ఉండగా, మరో రూ.4 లక్షలు ప్రైవేటు అప్పులు ఉన్నాయి. వర్షాలు ఏకధాటిగా కురవడంతో ప్రారంభంలో పంటలు దెబ్బతినగా, తర్వాత వానలు పడకపోవడం, పత్తి, కంది పంటలకు అవసరమైన సమయంలో నీరు అందకపోవడంతో దిగుబడిపై ప్రభావం పడింది. ప్రభుత్వ హామీ రూ.2 లక్షల రుణం ఇప్పటికీ మాఫీ కాలేదు. అప్పుల బాధ భరించలేక మనోవేదనకు గురైన ఆశన్న మార్చి 19న చేనులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో పిల్లలు భవిష్యత్తుపై పెట్టుకున్న ఆశలకు ఆటంకం ఏర్పడింది.

కాకేర్ల ఆశన్న ఫొటోతో భార్య, కూతురు, కుమారుడు

అప్పులే ఆశన్న ప్రాణం తీశాయి

మాకున్న ఆరెకరాలతోపాటు మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని.. పదెకరాల్లో పంటలు వేశాం. కౌలు, పంట పెట్టుబడి కోసం రూ.3 లక్షల వరకు అప్పులు తెచ్చాం. పిల్లల భవిష్యత్తు కోసమే రెక్కలు ముక్కలు చేసుకున్నాం. ప్రైవేటు వ్యాపారుల వద్ద ఎక్కువ మిత్తి అయినా పంట పండించి తీర్చుదాం అని అనుకున్నాం. పొద్దు మాపు పొలంగాన్నే పడిఉన్నాం. ఎండా, వాన లేక కష్టపడ్డాం. దేవుడు మా గోస చూడలే. వానలు బాగా వచ్చి పత్తి, కంది పంటలు మునిగిపోయాయి. మళ్లీ పత్తికి అవసరమైన సమయంలో నీళ్లు అందలేదు. పంట దిగుబడి రాలేదు. పెట్టిన పెట్టుబడి పోయింది. ఆఖరు అప్పులే మిగిలాయి. ఆ అప్పులే మా ఆశన్న ప్రాణం తీశాయి. పిల్లల చదువు కోసమైనా సర్కారు మా కుటుంబాన్ని ఆదుకోవాలి.

- సుచరిత, రైతు ఆశన్న భార్య